క్లుప్తంగా

సెల్‌ఫోన్ల అప్పగింత



నిజాంసాగర్(జుక్కల్): సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఇద్దరికి వాటిని రికవరీ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఎస్సై సుధాకర్ అప్పగించారు. మహమ్మద్ నగర్ మండలంలోని నడిమితాండకు చెందిన కడావత్ రాజేష్ నెల రోజుల కిందట సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. అలాగే ఆరేడ్ గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ ఆరు నెలల కిందట సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. ఇద్దరు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా రికవరీ చేసి అప్పగించామని ఎస్సై తెలిపారు.

చుక్కాపూర్ వ్యక్తికి..



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన మినుకూరి నరసింహారెడ్డి ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఆదివారం ఎస్సై శ్రీనివాస్ గౌడ్ బాధితునికి సెల్‌ఫోన్ అందజేశారు.

సొసైటీలలో వరి విత్తనాలు

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పుల్కల్, బిచ్కుంద సొసైటీలలో వరి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అవసరమున్న రైతులు తీసుకెళ్లవచ్చని కార్యదర్శి శ్రావణ్ తెలిపారు. మంచి రకం వరి విత్తనాలు రెండు రకాలు ఉన్నాయని, ఎంఆర్‌పీ ధరకే విక్రయిస్తున్నామని అన్నారు. అలాగే కిసాన్ కంపెనీ డీఏపీతో పాటు అన్ని రకాల ఎరువులు సొసైటీలో అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయిస్తున్నామని, అవసరం ఉన్న రైతులు తీసుకెళ్లాలని కోరారు.

తారు రోడ్డుగా మార్చాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రహ్మజివాడి గ్రామ శివారులోని మట్టి రోడ్డును తారు రోడ్డుగా మార్చాలని పలుగ్రామాల ప్రజలు కోరుతున్నారు. వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో ఉన్న పెద్దగోదాం వరకు ఈ రోడ్డు ఉందని కొద్దిగా వర్షం పడితే బురదమయంగా మారుతోందన్నారు. దీంతో ఈ రోడ్డుపై వెళ్లలేక పోతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన వరి ధాన్యం, మక్కలను ఈ గోదాంకు తరలిస్తారు. ఈ రోడ్డును తారు రోడ్డుగా మార్చాలని అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ఆరంభమైందని, పెద్ద వర్షం పడితే ఇక బురదలో ప్రయాణించడమే అవుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును తారు రోడ్డుగా మార్చి తమ సమస్యలను తీర్చాలని కోరుతున్నారు.

సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలి



బోధన్: తమ హక్కులను కాపాడుకునేందుకు కార్మికులు, ప్రజలు సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకర్‌గౌడ్, నూర్జహాన్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో రెండు రోజులుగా కొనసాగిన సీఐటీయూ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ఆదివారం ముగిశాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ, కార్మికుల కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయడంలో ప్రభుత్వాలు, యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలుకు సంఘటిత పోరాటాలు చేయడం తప్ప మరో మార్గం లేదని, పోరాటాలకు కార్మికులను సంసిద్ధం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. యూనియన్ రాష్ట్ర ప్రతినిధులు వంగూరు రాములు, ఎండీ అబ్బాస్, ఎన్వీ రమా, రమేష్‌బాబు, జంగం గంగాధర్, నన్నేసాబ్, వివిధ రంగాల కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



నత్తనడకన పల్లె దవాఖానా పనులు

- రెండేళ్ల నుంచి నిలిచిపోయిన వైనం
- నిధులు లేవంటున్న అధికారులు

బిచ్కుంద(జుక్కల్): ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే మంచి లక్ష్యంతో గత ప్రభుత్వం గ్రామాల్లో పల్లె దవాఖానాలు, పట్టణ ప్రాంతాల్లో బస్తీ దవాఖానాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. భవనం నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. రెండేళ్ల నుంచి భవనం పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు ప్రభుత్వం భవనం నిర్మాణాల కోసం రెండేళ్లలో చిల్లీ గవ్వ నిధులు మంజూరు చేయలేదు. నిర్మాణ పనులు పంచాయతీరాజ్ (పీఆర్) శాఖకు అప్పగించి వెంటనే పనులు ప్రారంభించాలని ఒత్తిడి తెచ్చారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ సగం పనులు చేసి వెళ్లిపోయారు. రెండేళ్ల నుంచి పనులకు మోక్షం లభించడం లేదు. 80 శాతం పనులు పూర్తయ్యాయి. బిల్లులు లేకుంటే పనులు చేయలేమని కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు ఆపేసి వెళ్లిపోయారని పీఆర్ అధికారులు అంటున్నారు. మండల కేంద్రాలలో ఉన్న పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులకు వెళ్లడానికి గ్రామీణ ప్రజలకు సౌకర్యాలు లేక అనారోగ్యం బారిన పడుతున్నారు. వైద్య సదుపాయాలు లేక నొప్పి భరించలేక ఆత్మహత్యలకు పాల్పడినట్లు



బిచ్కుందలో ఆగిన పల్లె దవాఖానా భవన నిర్మాణం

పోలీసుల విచారణలో ఎన్నో కేసులు బయటపడ్డాయి. ప్రభుత్వాలు మారుతున్నా ఎలాంటి ప్రయోజనం లేదు. పాలకుల నిర్లక్ష్యంతో గ్రామీణ పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది.

ఎనిమిది పల్లె దవాఖానాలు మంజూరు..

ఐదు వేల జనాబాకు ఒక ఎంబీబీఎస్ వైద్యుడు ఉండాలని గ్రామాలలో పల్లె దవాఖానాలు ఏర్పాటు చేశారు. బిచ్కుంద మండలంలో ఖద్గాం, హజ్గుల్, పెద్దదడ్గి, ఫత్లాపూర్, మిషన్ కల్లాలి, బిచ్కుందలో రెండు సెంటర్లు, శాంతాపూర్‌లకు పల్లె దవఖానాలు మంజూరు చేశారు. దవాఖానాలలో ఒక ఎంబీబీఎస్ వైద్యుడు, ఒక స్టాఫ్‌నర్సు, ఏఎన్‌ఎంలు ఇద్దరు, ఆశావర్కర్లు ఐదుగురు ఉంటారు. వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు, వైద్యం చేస్తారు. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుడు జిల్లా ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేస్తారు. ప్రస్తుతం భవనం నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో భవనాలు అద్దెకు తీసుకొని నాలుగు గ్రామాల్లో అరకొర వైద్య సేవలు అందిస్తున్నారు. హజ్గుల్, ఖద్గాం, శాంతాపూర్‌లో పల్లె దవాఖానాలు మంజూరైనా అక్కడ కొనసాగడం లేదు. జుక్కల్ ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి గ్రామీణులు, గిరిజన తండాలలో వైద్య సదుపాయాలు అందే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిలో కుర్మ సాయిబాబా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడల వల్ల మానవ సంబంధాలు మెరుగవుతాయని, ఆటల వల్ల శరీరం ఆరోగ్యంగా కూడా ఉంటుందన్నారు. క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని యువతకు సూచించారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన సోమర్యాగడి తాండా జట్టుకు రూ.11,111, రన్నరప్‌కు రూ.7,777 నగదును అందించారు. సీఐ రవీందర్ నాయక్, టోర్నీ నిర్వాహకులు సాయిబాబా తదితరులున్నారు.



ట్రోఫీ అందజేస్తున్న డీఎస్పీ

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- ఎంపీడీవో నరేశ్
- మండల కేంద్రంలో పర్యటన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో యువత స్వచ్ఛందంగా 15 రోజులుగా తొలగిస్తున్నారు. గ్రామంలో మార్పు కోసం 20 మంది యువకులు ప్రతీ రోజు ఒక కాలనీని ఎంచుకొని శుభ్రం చేస్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలో భారీ వర్షం కురియడంతో మురికి కాల్వల నుంచి మురికి నీరు రోడ్లపైకి వచ్చి ప్రవహించింది. దీంతో వీధుల్లో దుర్వాసన వస్తోందని యువకులు స్థానిక ఎంపీడీవో నరేష్, జీపీ కార్యదర్శి శ్రావణ్ కుమార్‌ను కలిసి సమస్యలు వివరించారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్త, మురికి కాల్వల్లో పేరుకుపోయిన పూడికను తొలగించాలని వినతిపత్రాలు అందజేశారు. గ్రామ పంచాయితీ కార్మికులు వారం రోజులుగా మురికి కాల్వల్లో పూడిక తీస్తున్నా పూర్తి స్థాయిలో శుభ్రం కావడం లేదు. కార్మికుల సంఖ్యను పెంచి మురికి కాల్వలు, వీధుల్లో చెత్తను తొలగించాలని కోరారు. రెండు రోజులుగా ఎంపీడీవో నరేష్ గ్రామంలోని వీధుల్లో పర్యటిస్తున్నారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వారి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమలు, ఈగలు పెరుగుతాయని, పరిసరాలను శుభ్రంగా ఉంచి దోమలు, ఈగలు రాకుండా నివారించాలని సూచించారు. యువకులు క్రాంతికుమార్, దిలీప్, బాల్‌రాజు, ప్రభాకర్, ఇమామ్, అశోక్, పవన్ ఉన్నారు.



వీధులను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేశ్

ఘనంగా బోనాల పండుగ



పోచారంలో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు



జప్తిజాన్కంపల్లిలో..



నాగిరెడ్డిపేట ఎంపీపీ వినీత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పోచారం, జప్తి జాన్కంపల్లి, చీనూర్ గ్రామాలలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని గ్రామశివారుల్లో గల దుర్గమ్మ, ఎల్లమ్మ, ముత్యాల పోచమ్మ తదితర గ్రామదేవతల ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. నాగిరెడ్డిపేట ఎంపీపీ వినీత పోచారంలో నెత్తిన బోనమెత్తుకొని గ్రామస్తులతో కలిసి బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

పోసాన్‌పల్లిలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మున్సిపాలిటీ పరిధిలోని పోసాన్‌పల్లిలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. శోభాయాత్ర నిర్వహించి బోనాలను సమర్పించారు. పిల్లా పాపలు, పాడి పంటలు సల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. మాజీ ఎంపీటీసీ చిరంజీవులు, రాములు, అంజయ్య తదితరులున్నారు.

ముత్యాల పోచమ్మ పండుగ

బాన్సువాడ రూరల్: కోనాపూర్ గ్రామంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముత్యాల పోచమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. బాజాభజంత్రీల నడుమ బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కులపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వనభోజనాలకు తరలిన గ్రామస్తులు

రాజంపేట: మండల కేంద్రంలో ఆదివారం పలు సంఘాల సభ్యులు వన భోజనాలకు తరలి వెళ్లారు. వర్షాకాలం ఆరంభం మృగశిర కార్తెను పురస్కరించకుని గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. గ్రామంలో వర్షాలు బాగా కురిసి పాడిపంటలతో వర్ధిల్లాలని గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.



పోసాన్‌పల్లిలో బోనాలతో శోభాయాత్ర



రాజంపేట మండల కేంద్రంలో..

గోసంతతిని కాపాడండి



దోమకొండ: గోసంతిని కాపాడాలని కోరుతూ ఆదివారం బీజేపీ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హిందువులు దేవతగా భావించే గోమాతను వధించి మాంసాహారంగా తింటున్నారని వారు పేర్కొన్నారు. 1977లో నాటి రాష్ట్ర ప్రభుత్వం గోమాతలను కాపాడటానికి ప్రత్యేక చట్టం తీసుకువచ్చిందన్నారు. కానీ గోమాతలను అక్రమంగా కబేళాలకు తరలించి వధిస్తున్నారన్నారు. ఈ విషయంలో పోలీసులు స్పందించి గోవధ జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సై గణేష్‌కు ఫిర్యాదు అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు చింతల రాజేష్, నాయకులు రవీందర్‌రెడ్డి, రావిరెడ్డి, తిప్పారపు రవి, నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి

ఎల్లారెడ్డి: నోటీసులు ఇవ్వకుండా తన పొలంలో కంచెను తొలగించిన నీటి పారుదల శాఖ అధికారులు నష్ట పరిహారం చెల్లించాలని రైతు పప్పు విశ్వనాథం అన్నారు. నాగన్నకుంటకు సంబంధించిన భూమిని తాను కబ్జా చేశానని, కొంత మంది రైతులు ఫిర్యాదు చేయడంతో తాను తన భూమిలో వేసుకున్న కంచెను నీటి పారుదల శాఖ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తొలగించినందుకు నష్ట పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

బక్రీద్‌కు ఈద్గాల ముస్తాబు



లింగంపేటలో ముస్తాబైన ఈద్గా



బాన్సువాడలో సేమియా కొనుగోలు చేస్తున్న ముస్లింలు

సాక్షి నెట్‌వర్క్: బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈద్గాలు ముస్తాబయ్యాయి. ఈద్గాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలను అమర్చారు. మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఈద్గాల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అలాగే పండుగ సందర్భంగా పట్టణాల్లో సందడి నెలకొంది. సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రమాదకరంగా మూలమలుపులు



బ్రహ్మజివాడి శివారులో మూలమలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు కిందకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు(ఫైల్)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలో పలు చోట్ల మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నా వాటి గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దగ్గరలో సూచికలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. తాడ్వాయి మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమం వద్ద కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలోని మూల మలుపు ఉండడంతో ఎన్నోమార్లు ప్రమాదాలు జరిగాయి. క్రిష్టాజివాడి శివారులోని ప్రధాన రహదారిలో మూలమలుపు ఉండడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ మూల మలుపు వద్ద రెండు సంవత్సరాల క్రితం పెళ్లికి వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇటీవల కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డికి వెళ్తున్న లారీ క్రిష్టాజివాడిలో ఓవర్ స్పీడ్‌తో వచ్చి రోడ్డు ప్రక్కన ఉన్న ఇల్లును ఢీకొట్టడంతో ఆ ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. రెండేళ్ల క్రితం బ్రహ్మజివాడి శివారులోని సామిల్ వద్ద కామారెడ్డి –ఎల్లారెడ్డిలోని ప్రధాన రహదారిలోని మూల మలుపు వద్ద ఓ ప్రైవేటు స్కూల్ బస్సు అదుపు తప్పి రోడ్డు క్రిందికి పోవడంతో అందులో ప్రయాణిస్తున్న పలువురు విద్యార్థులు తీవ్రగాయాలపాలయ్యారు. అదే స్థలంలో ఎన్నో సార్లు కార్లు, బైక్‌లు అదుపుతప్పి బోల్తాపడ్డాయి. అదే స్థలంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ హెడ్ కానిస్టేబుల్ మృతిచెందారు. ఐదు రోజుల కామారెడ్డి ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలోని పోచమ్మ ఆలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజు అనే వ్యక్తి మృతిచెందాడు. కొన్ని నెలల క్రితం ఎండ్రియాల్ శివారులోని మూల మలుపు వద్ద ఎన్నో మార్లు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఎర్రాపహాడ్ శివారు, కన్‌కల్ శివారు, కరడ్‌పల్లి, బ్రాహ్మణపల్లి శివారు, చిట్యాల, సంతాయిపేట్ శివారు రోడ్లలో మూల మలుపులు ఉండడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మూలమలుపులకు శాశ్వత పరిష్కారం చూడాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



శబరిమాత ఆశ్రమం వద్ద కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో మూలమలుపు

వానరాల ఆకలి కేకలు



మాచారెడ్డి: ఒకప్పుడు వానరాలు శాఖాహారులు. కేవలం అటవీ ఉత్పత్తులను తిని జీవనం సాగిస్తుండేవి. ప్రస్తుతం అడవిని విపరీతంగా నరికివేయడం వల్ల వాటికి ఆహారం దొరక్క ఇలా ఊర్ల మీద పడి ఏది దొరికితే దాన్ని తింటున్నాయి. ఆదివారం గజ్యానాయక్ తండా చౌరస్తాలోని వీర హన్మాన్ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో వర్షాకాలంలో వచ్చే ఊసిళ్లను(పురుగులు) ఇలా ఎగబడి తింటున్నాయి. అంతే కాకుండా ఇళ్లల్లోకి చొరబడి కోడి గుడ్లు, అన్నం, మటన్, చికెన్ ఏది అందుబాటులో ఉంటే దాన్ని ఎత్తుకుపోయి తింటున్నాయి. ఎవరైనా చేతిలో కవర్లు పట్టుకొని రోడ్డు మీది నుంచి నడ్చుకుంటూ పోతే ఖతం.. కవర్లు ఎత్తుకొని పరారవుతున్నాయి.

పాఠశాలలో దొంగతనంపై ఫిర్యాదు



దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో దొంగతనంపై ఆదివారం పాఠశాల ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, బాపురెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాఠశాల తాళాలు పగులగొట్టి పాఠశాలలోని ఇన్వర్టర్‌ను దొంగిలించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాంప్లెక్స్ పాఠశాలలో వాచ్‌మెన్ పోస్టు ఉండగా, దానిని భర్తీ చేయకపోవడం వల్ల దొంగతనాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. గతంలోనూ పాఠశాల తాళాలు పగులగొట్టి వాటర్ పైపులైన్, డ్రైయినేజీకి సంబంధించిన పైపులైన్‌లను పగులగొట్టారని వారు పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో బయట వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్‌ఐ గణేష్‌కు ఫిర్యాదు అందజేసి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఆధ్యాత్మికం

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సమస్యలపై ప్రజావాణి

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యుత్ వినియోగదారుల సమస్యలు సకాలంలో పరిష్కరించడానికి నేడు(సోమవారం) విద్యుత్ ప్రజావాణి నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈలు సాయినాథ్, హరీష్‌రావు తెలిపారు. ఎస్‌ఈ కామారెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. శెట్పల్లిసంగారెడ్డి సెక్షన్, లింగంపేట సబ్‌డివిజన్‌లో విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. సోమవారం బక్రీద్ పండగ ఉన్నప్పటికి ప్రజావాణి కొనసాగుతుందన్నారు.

సంక్షిప్తం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



తాడ్వాయి(ఎల్లారెడ్డి): చందాపూర్ గ్రామంలో ఆదివారం 1995–96 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. గ్రామానికి చెందిన ఆవుల రాజేందర్ అనే వ్యక్తి 3 రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. కొన్ని సంవత్సరాల క్రితం రాజేందర్ భార్య కూడా మృతి చెందడంతో ఇద్దరు కుమారులు అనాథలయ్యారు. దీంతో రాజేందర్ చిన్ననాటి మిత్రులు స్పందించి వారికి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇద్దరు పిల్లలకు తమ వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, శిరీష్‌రెడ్డి, నగేష్, బాలయ్య, రాజశేఖర్, రవీందర్‌రెడ్డి, రాములు, మధుసూదన్, ప్రవీణ్‌రెడ్డి, రాజేందర్, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి..



భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన కొట్టాని రంజిత్ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో.. సిద్ధరామేశ్వరాలయం పునర్నిర్మాణ కమిటీ డైరెక్టర్ తాటికొండ బాబు రూ.10,200 ఆదివారం అందజేశారు. నేతలు డప్పు రవి, రాజు, నర్సింలు, మహేశ్ సిద్దరాములు తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

బస్వాపూర్ గ్రామంలో నిరుపేద ఒకరు ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కాంగ్రెస నేతల ద్వారా షబ్బీర్ ఫౌండేషన్ తరపున రూ.5 వేలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతనూరి సిద్ధరాములు, నేతలు జీవన్, బాబు, లోకేష్, బాగారెడ్డి, ఎల్లం, రాజేశ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మాజీ విప్ తరపున ..

బస్వాపూర్ గ్రామంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన వంక సిద్ధయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న గంప గోవర్ధన్ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5 వేలను పంపించారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బుర్రి గోపాల్, బీఆర్‌ఎస్ నేతలు భిక్షపతి, సిద్ధరాములు, బాబు, పరుశరాం, నర్సింలు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

WALK - IN INTERVIEW



కామారెడ్డి కేంద్రంగా ఉంటూ.. కామారెడ్డి పట్టణములో పరిసర ప్రాంతాలలో ప్రకటనలు సేకరించుటకు చురుకైన, వాక్చాతుర్యం గల, ఎదుటి వారిని ఒప్పించి, మెప్పించే నేర్పుగల

Advt. Representatives / ఫీల్డ్ స్టాఫ్ కావలెను.

మీ ప్రాంతంలోనే ఒక బాధ్యతాయుతమైన ఉద్యోగం చేయాలనుకుంటే సంప్రదించండి..

విద్యార్హత : 10వ తరగతి లేదా ఆపైన

వయస్సు : 18 సం॥లు ఆపైన

పత్రికా రంగంలో అనుభవం గల వారు మరియు కొత్తవారు కూడా సంప్రదించవచ్చు.

ఇంటర్వ్యూ తేది : 19-06-2024 బుధవారం రోజున ఉదయం 10 గం॥ల నుండి సాయంత్రము 4 గం॥ వరకు.

ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్స్‌తో ఈ దిగువ చిరునామాలో సంప్రదించగలరు.

సాక్షి రేపటికి ముందడుగు

సాక్షి సిటీ ఆఫీస్, మొదటి అంతస్తు, కవితా కాంప్లెక్స్, బస్టాండ్ రోడ్, నిజామాబాద్. సెల్ నెం. 9912220764

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: డి. యల్. ఎస్. గౌడ్ : 6300453108
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899